క్లుప్తంగా

తైబజార్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని గాంధీనగర్, దుర్గానగర్, అల్వాల్ సర్కిల్ పరిధిలోని వెస్ట్ వెంకటాపురం ప్రాంతాల్లో సోమవారం తైబజార్ (వారాంతపు సంత) నిర్వహిస్తారు.

వైద్య సేవలు

అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సోమవారం గర్భిణుల పేర్ల నమోదు, సాధారణ చికిత్సలు, హోమియో వైద్య సేవలు అందిస్తారు.

చీరల పంపిణీ



చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ దివ్యాంగులకు చేయూత అందించాలని బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ అన్నారు. చెంగిచర్ల నందినగర్‌లో ఆదివారం 20 మంది దివ్యాంగులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కొత్త రవిగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత



మల్కాజిగిరి: చాణక్యపురికి చెందిన విజయలక్ష్మి వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చొరవతో రూ.2 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఆదివారం మల్కాజిగిరి క్యాంపు కార్యాలయంలో ఆమె కుమార్తె వాణికి ఎల్‌ఓసీ పత్రాలను బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి జీఎన్వీ సతీష్‌కుమార్, పీఏ మునిస్వామి అందజేశారు.

వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు



అల్వాల్: సీతారామ నామ సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో అల్వాల్‌లోని హరిదాస మండపం వద్ద 72వ సీతారామ వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కళాక్షేత్ర నృత్యశాల వారిచే ప్రదర్శించిన సుబ్బలక్ష్మి భరత నాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు కందకట్ల సుదర్శన్‌రెడ్డి, పరాంకుశం మాధవ్, గోపాల్, గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

కాప్రా: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని కోరుతూ జమ్మిగడ్డలో చేపట్టిన జ్ఞానమాల కార్యక్రమం 43వ వారానికి చేరుకుంది. ఇందులో భాగంగా ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఐక్యతతో ముందుకు సాగితే అంబేడ్కర్ ఆశయాలను సాధించవచ్చని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్‌కుమార్, బీజేఆర్ కాలనీ అధ్యక్షుడు రహీం, దయానంద్, రవి, రాములు, కొండల్, చిన్నారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు రావాలని ఆహ్వానం



లక్ష్మారెడ్డిని ఆహ్వానిస్తున్న వివిధ కాలనీల ప్రతినిధులు

కాప్రా: శ్రీరామనవమి సందర్భంగా గాంధీనగర్, చక్రీపురం, కుషాయిగూడలోని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఈ నెల 30న సీతారామచంద్రస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు రావాలని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారు లక్ష్మారెడ్డిని ఆయా కాలనీల ప్రతినిధులు ఆదివారం ఆహ్వానించారు. కార్యక్రమంలో జూపల్లి శ్రీశైలం, నేమూరి మహేష్‌గౌడ్, వెంకటచారి, రాజు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోకున్నా పైసలిస్తరా..?

- టాయిలెట్స్ నిర్వహణలో భారీగా అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు
- కాప్రా సర్కిల్ పరిధిలో నిరుపయోగంగా మారిన పబ్లిక్ టాయిలెట్స్
- నిర్వహణ లేకున్నా కాంట్రాక్ట్ సంస్థకు నగదు చెల్లింపు
- ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నా పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కాప్రా: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్‌లో చేపట్టిన పబ్లిక్ టాయిలెట్స్ ఆర్భాటంగా ప్రారంభమైనా నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. కొందరు అధికారులు కాంట్రాక్టు సంస్థతో కుమ్మక్కై ప్రజా ధనాన్ని అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాప్రా సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్ల పరిధిలో 108 పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించారు. ఇందులో 7 బాట్ టాయిలెట్స్ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్(పీపీపీ), మరో 100 ప్రాపికేటెడ్ టాయిలెట్స్ ఉన్నాయి. వీటిలో 96 ప్రాపికేటెడ్ టాయిలెట్స్ ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి అదనంగా సర్కిల్ పరిధిలోని కమర్షియల్ ఏరియాలో మరో 8 టాయిలెట్స్‌తో పాటు రెండు మొబైల్ టాయిల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే నిర్వహణలోపంతో అవి ప్రజలకు అందుబాటులో లేకుండాపోయాయి.

ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు..

గతంలో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఉన్న స్వచ్ఛ టాయిలెట్స్ పర్యవేక్షణ బాధ్యతలను శానిటరీ విభాగానికి అప్పగించారు. ప్రాపికేటెడ్ టాయిలెట్స్ నిర్వహణ బాధ్యత రషా ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ సంస్థకు ఇచ్చారు. పీపీపీ పద్ధతిలో ఉన్న టాయిలెట్స్ బాగానే నిర్వహిస్తున్నప్పటికీ రషా ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ సంస్థకు అప్పగించిన ప్రాపికేటెడ్ టాయిలెట్స్ మాత్రం నిరుపయోగంగా మారాయి. వీటిని పర్యవేక్షించాల్సిన శానిటరీ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే అవి నిరుపయోగంగా మారాయని పలువురు విమర్శిస్తున్నారు.

నిర్వహణ లేకున్నా నిధుల చెల్లింపు..

ప్రాపికేటెడ్ టాయిలెట్స్ నిర్వహణ లేకున్నా ప్రతినెలా నిధులు మాత్రం సదరు కాంట్రాక్టు సంస్థకు వెళ్తున్నాయి. ఈ టాయిలెట్స్‌లో ఒక్కో బేసిన్‌కు జీహెచ్‌ఎంసీ రూ.4 వేలు చెల్లిస్తుంది. ఒక్కో చోట రెండు బేసిన్లు ఉన్నాయి. కమర్షియల్ ఏరియాలో ఉన్న టాయిలెట్స్ నిర్వహణకు రూ.8 వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఇక మొబైల్ టాయిల్స్‌కు ఎంత చెల్లిస్తున్నారనేది ప్రశ్నార్థకం. అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం కాప్రా సర్కిల్ నుంచి సదరు కాంట్రాక్టు సంస్థకు ప్రతినెలా ప్రాపికేటెడ్ టాయిలెట్స్ నిర్వహణకు సుమారు రూ.4 లక్షలకు పైగానే, కమర్షియల్ ఏరియాల్లో ఉన్న వాటికి రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఒక్కో మొబైల్ టాయిలెట్ నిర్వహణకు ఎంత చెల్లిస్తున్నారనేది అధికారులకు సైతం తెలియని పరిస్థితి ఉంది. టాయిలెట్స్ నిర్వహణలో జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



మొబైల్ టాయిలెట్స్



నిరుపయోగంగా మారిన టాయిలెట్స్

కాంట్రాక్టు సంస్థతో అధికారుల కుమ్మక్కు..?

టాయిలెట్స్ నిర్వహణ సొమ్మును కొందరు అధికారులు, కాంట్రాక్టు సంస్థ నిర్వాహకులు పంచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాపికేటెడ్ టాయిలెట్స్, మొబైల్ టాయిలెట్స్ కాప్రా సర్కిల్ పరిధిలో ఎక్కడా పని చేస్తున్న దాఖలాలు లేవు. అయినా వీటికి రెగ్యులర్‌గా అటెండెన్స్ వేస్తూ ఉన్నతాధికారులకు ఎలా పంపుతున్నారనే దానిపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. వీటిపై సంబంధిత అధికారులను వివరణ కోరితే తాము అటెండెన్స్ మాత్రమే పంపుతున్నామని, ఇతర వివరాలు తెలియవని సమాధానం దాటవేస్తున్నారు. స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం కొందరి నిర్లక్ష్యంతో నీరుగారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి..

టాయిలెట్స్ నిర్వహణ విషయంలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. స్వచ్ఛ టాయిలెట్స్‌పై జోనల్ కమిషనర్, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. విచారణ జరిపి అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ సొమ్మును రికవరీ చేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమగ్ర విచారణకు ఆదేశిస్తాం



కాప్రా సర్కిల్ పరిధిలో స్వచ్ఛ టాయిలెట్స్ నిర్వహణ బాగానే ఉంది. అవకతవకలు జరిగాయని తేలిస్తే సమగ్ర విచారణ జరిపిస్తాం. విచారణలో తప్పుడు నివేదికలు పంపుతున్నారని తేలినా, నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు రుజువైనా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– ఎన్.శంకర్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్

ఆలయ అభివృద్ధికి విరాళం



ఎమ్మెల్యే చేతుల మీదుగా విరాళం అందజేస్తున్న కార్పొరేటర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ నల్లపోచమ్మ ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయ అభివృద్ధి కోసం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ రూ.1 లక్ష నగదును ఎమ్మెల్యే సమక్షంలో కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉమామహేశ్వరచారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో కార్పొరేటర్ గీతకు బహుమతి

ఉప్పల్: జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ల స్పోర్ట్స్ మీట్–2023లో చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత బహుమతి అందుకున్నారు. క్యారమ్స్, టెన్నికాయిట్ విభాగాల్లో ఆమె బహుమతులు సాధించారు. ఎమ్మెల్యే గాంధీ, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి చేతుల మీదుగా ఆమె బహుమతి, ప్రశంసా పత్రం అందుకున్నారు.

మైసమ్మ ఆలయానికి విరాళం

ఘట్‌కేసర్: మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతాపసింగారంలో నూతనంగా నిర్మించిన గుబ్బరిగుట్ట మైసమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు సందీప్‌రెడ్డి విరాళమిచ్చాడు. ఆదివారం ఆలయం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి రూ.30 వేలు అందజేశాడు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.3 కోట్ల వ్యయంతో శ్రీనివాసనగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం, కుషాయిగూడ శాంతివనం స్మశానవాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డి, మాజీ కార్పొరేటర్లు పజ్జూరి పావనీరెడ్డి, కొత్త రామారావు, టీపీసీసీ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ టెక్నో స్కూల్ వార్షికోత్సవం



బోడుప్పల్: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్ ఎస్‌ఎస్‌ఎస్ గార్డెన్‌లో జరిగిన బ్రిలియంట్ టెక్నో హైస్కూల్ 13వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు తెలిపారు. బ్రిలియంట్ టెక్నో స్కూల్ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన చేస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుందన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఓయూ మాజీ ఉపసంచాలకుడు మసన చెన్నప్ప, బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, స్కూల్ చైర్మన్ పానుగోటి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణపై విద్యార్థినులకు అవగాహన

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో అనురాగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వేసవి ప్రత్యేక శిబిరం–23లో ఆత్మరక్షణపై షీల్డ్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ కావేరి హాజరై మాట్లాడుతూ.. ఎవరైన దాడి చేసినప్పుడు భయపడకుండా కళ్లు ఇతర సున్నిత భాగాలపై కొట్టాలన్నారు. షీల్డ్ అకాడమీ వ్యవస్థాపకుడు సంతోశ్ కుమార్ మాట్లాడుతూ ఏ క్షణంలోనైనా ఎవరైన దాడికి గురి కావచ్చని, అటువంటి సందర్భాలను ఎదుర్కొవడానికి ఆత్మరక్షణలో శిక్షణ తప్పనిసరన్నారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, అనురాగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్, యూనిట్–4 ఆఫీసర్ కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మరక్షణపై అవగాహన కల్పిస్తున్న షీల్డ్ అకాడమీ ప్రతినిధులు



సందడిగా ఫేర్‌వెల్ పార్టీ

బోడుప్పల్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో ఆదివారం ఫేర్‌వెల్ నిర్వహించారు. త్వరలో వార్షిక పరీక్షలు రాయనున్న 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ పార్టీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– మేడిపల్లి

ఐకమత్యంతోనే హక్కుల సాధన

మల్కాజిగిరి: బడుగులకు రాజ్యాధికారం రావాల్సిన అవసరం ఉందని దళిత్ శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. ఆదివారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా బీసీ, ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. అందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే హక్కులను సాధించుకోగలమని చెప్పారు. కార్యక్రమంలో రాజ్‌కమల్ మహరాజ్ పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డికి ఉగాది నంది అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న సతీష్‌రెడ్డి


కుషాయిగూడ: కాప్రాకు చెందిన బీఆర్‌ఎస్ నేత రేగళ్ల సతీష్‌రెడ్డి ఉగాది నంది అవార్డు అందుకున్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం చేసిన కృషిని గుర్తించి కళానిలయం వారు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి, తెలంగాణ నీటి పారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, కొడకండ్ల శివరామశర్మ, నటి జయలక్ష్మి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. తనను అవార్డుకు ఎంపిక చేసిన కళానిలయం ప్రతినిధులు పుష్పలత, సురేందర్‌లకు సతీష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

మౌలాలి: మల్కాజిగిరి నియోజకవర్గంలోని బీజేపీ ఓబీసీ మోర్చా కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

మల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బీఆర్‌ఎస్‌కేవీ కార్మిక విభాగం అధ్యక్షుడు కుర్మన్న వినతిపత్రం అందజేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల జీతం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగలు, జాతీయ సెలవు దినాలను పారిశుద్ధ్య కార్మికులకు సెలవు దినాలుగా ప్రకటించాలని వినతిపత్రంలో కోరారు.



రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కుర్మన్న

తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో గణనీయమైన అభివృద్ధి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మంత్రి చామకూర మల్లారెడ్డి

మల్లాపూర్: దేశాన్ని 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, తొమ్మిదేళ్లుగా పాలిస్తున్న బీజేపీ వల్ల దేశం అధోగతి పాలైందని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం నాచారం ఏఎస్ఆర్ గార్డెన్స్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని, తొమ్మిదేళ్లలోనే గణనీయమైన అభివృద్ధి సాధించామన్నారు. కేసీఆర్‌ను దెబ్బ తీసేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలతో ఎమ్మెల్సీ కవితను వేధిస్తున్నారని ఆరోపించారు. అనంతరం మేడ్చల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత బలీయమైన శక్తిగా మార్చాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు శాంతి సాయిజెన్‌శేఖర్, పన్నాల దేవేందర్ రెడ్డి, జెరిపోతుల ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కార్పొరేటర్ స్వర్ణరాజ్‌కు మాజీ మేయర్ పరామర్శ

కుషాయిగూడ: అనారోగ్యంతో బాధపడుతున్న కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్‌ను ఆదివారం గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకుడు రేగళ్ల సతీష్‌రెడ్డి, సీతారాంరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణరాజ్‌ను పరామర్శిస్తున్న రాంమోహన్, శ్రీనివాస్

డీఎస్‌ఎల్ మాల్‌లో పెట్ షో



పెట్ షోలో పాల్గొన్న జంతు ప్రేమికులు

ఉప్పల్: డీఎస్‌ఎల్ మాల్‌లో ఆదివారం పెట్ షో నిర్వహించారు. ఈ షోలో వివిధ రకాల పెంపుడు జంతువులను ప్రదర్శించారు. పెట్ గ్రూమింగ్ పెట్ వ్యాక్సినేషన్ డ్రైవ్, పెంపుడు జంతువుల ఆహారం వంటి అంశాలపై జంతు ప్రేమికులకు అవగాహన కల్పించారు. కుక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. కూచిపూడి నృత్య అకాడమీ గురువు షణ్ముఖ శిష్యబృందం బాలరామాయణం నృత్యం ప్రదర్శించారు. బాలరామాయణం, నిహారిక, విరాజ, అధితి, నిహి, ఆశీ, మనవి, రాగ చిన్మయి నృత్యాలను ప్రదర్శించారు.

– మల్లాపూర్